సాక్షి
హనుమకొండ

మంగళవారం । 25 । జూన్ । 2024



ఇక.. గుర్తింపు సులువు
టీజీ ఎన్పీడీసీఎల్.. అధునాతన సాంకేతికత వినియోగంపై దృష్టి సారించింది. రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురానుంది. - 8లో▸



కార్మిక ఖజానా ఖాళీ?
పని దొరికితేనే కుటుంబం గడిచేది.. లేదంటే పస్తులే.. ఇలా దినదిన గండంగా బతుకు లీడుస్తున్న అడ్డా కూలీలకు సర్కార్ నుంచి భరోసా కరువైంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ర్యాలీని విజయవంతం చేయండి



హన్మకొండ అర్బన్ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవం సందర్భంగా రేపు (బుధవారం) అదాలత్ కూడలి నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవం నేపథ్యంలో 'సాక్ష్యం స్పష్టంగా ఉంది.. నివారణే పెట్టుబడి ' అనే థీమ్‌తో నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి మధురిమ మాట్లాడుతూ ఈ ర్యాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, డీఐఈఓ గోపాల్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
విద్యారణ్యపురి/కాశిబుగ్గ సెంటర్ : రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)కోర్సుల్లో 2024–26 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ డీఈఓలు ఎండీ అబ్దుల్‌హై , వాసంతి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. దరఖాస్తుకు ఈనెల 30వరకు అవకాశం ఉందన్నారు. జూలై 10వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీ : //డీఈఈసెట్. డీఎస్ఈ. తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని వారు కోరారు.

బీఓఎస్ చైర్మన్‌గా పద్మజారాణి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ లా (న్యాయ) కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.పద్మజారాణి నియామకం అయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు బీఓఎస్‌గా బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ శ్రీనివాస్ నుంచి పద్మజారాణి బాధ్యతలను స్వీకరించారు. పద్మజారాణి యూనివర్సిటీ లా కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గతంలో యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా, విశ్వవిద్యాలయం హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గాను పనిచేశారు. పలు జాతీయ,అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు.

ఆర్టీసీని ఆదరించాలి




హన్మకొండ : ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించాలని వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను కోరారు. సోమవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో మహాలక్ష్మి పథకం, డీలక్స్ బస్సులో లక్కీ డ్రా పై కళా ప్రదర్శన ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సుఖవంతం, సురక్షితమన్నారు. డీలక్స్ బస్సులో ప్రయాణించి మహిళలకు లక్కీడీప్ ద్వారా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్ భానుకిరణ్, వరంగల్–1 డిపో మేనేజర్ మోహన్ రావు, కళాకారులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల ధర్నా



కాశిబుగ్గ సెంటర్: నాగ్‌పూర్ నుంచి అమరావతి(విజయవాడ) గ్రీన్ ఫీల్డ్ హైవే కింద పోతున్న భూమి బాధితులు తమకు న్యాయం చేయాలని వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా బాధిత రైతులు రాంచందర్ రావు, నర్సయ్య, రంగయ్య బాలరాజు తదితరులు మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవేను బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చాలని, లేదా గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దు చేయాలన్నారు. రద్దు చేయకపోతే ఎకరాకు రూ.10 కోట్ల ధర ప్రకటించాలని, టోల్ రుసుములో 70 శాతం వాటా రైతులకు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తమ డిమాండ్‌లను పరిష్కరించకపోతే ఎలాంటి త్యాగాలకైనా రైతులంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



రూ.9.19 కోట్లు..
'రియల్' వ్యాపారి నుంచి వసూలులో తాత్సారం

రెవెన్యూ అధికారులు డబ్బులు చెల్లించింది ఈ రోడ్డు చుట్టూ ఉన్న ప్లాట్లు, రోడ్లకే..

- భూసేకరణ పేరిట ఖజానాకు 'రెవెన్యూ' లూటీ
- ప్లాట్లు విక్రయించిన రియల్ వెంచర్‌కు రూ.కోట్లు ఇచ్చిన అధికారులు
- భువనగిరి–ఆరెపల్లి హైవే బైపాస్‌లో అక్రమాలు
- బయట పడ్డాక నోటీసులతో కాలయాపన
- కలెక్టర్లను తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు
- నాలుగేళ్లు దాటినా వసూలు చేయని రెవెన్యూ అధికారులు

మరికొన్ని ఘటనలు..

- వరంగల్ పరిధిలో టెక్స్‌టైల్ పార్క్ భూసేకరణ ఓ అధికారికి కాసులవర్షం కురిపించిన వ్యవహారంపై వేసిన విచారణ కమిటీ నివేదిక బుట్టదాఖలైంది.
- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో రామప్ప నుంచి ధర్మసాగర్ ట్యాంకు వచ్చే పైప్‌లైన్ నిర్మాణం కోసం చేసిన భూసేకరణ కింద సమ్మిరెడ్డి అనే రైతుకు చెల్లించాల్సిన రూ.6,87,500లను రమేష్ అనే వ్యక్తి ఖాతాలో వేయడం అప్పట్లో వివాదస్పదమైంది.

సాక్షిప్రతినిధి, వరంగల్:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం కోసం భూసేకరణలో రెవెన్యూ అధికారులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దళారులు ప్రమేయంతో కొందరు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పనంగా కట్టబెట్టారు. అందుకు ప్రతిఫలంగా భారీగా ముడుపులు తీసుకున్నట్లు అనేక ఉదంతాలు బహిర్గతమవుతున్నాయి. యాదాద్రి(భువనగిరి) నుంచి ఆరెపల్లి వరకు నిర్మించిన ఔటర్ రింగ్, బైపాస్ రోడ్డు భూసేకరణలో అక్రమాల ఖరీదు రూ.9.19 కోట్లు. ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకుడు, అధికారులు మిలాఖత్ అయ్యి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. విషయం బయటపడ్డాక అతనినుంచి ఆ నగదు వసూలులో తాత్సారం చేస్తున్నారు.

'రియల్' వెంచర్‌కు రూ.9.19 కోట్లు...

హసన్‌పర్తి మండలం భీమారం శివారులోని సర్వే నంబర్ 353లో సుమారు 14.15 ఎకరాల భూమి ఉంది. ఈభూమి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 2006లో కొనుగోలు చేశాడు. వీటితోపాటు పక్కన మరికొంత భూమిని ఖరీదు చేశాడు. ఇందులో వెంచర్ చేసి సుమారు 673 ప్లాట్లుగా విభజించి అప్పటి మార్కెట్ ధర మేరకు ప్లాట్లు చేసి విక్రయించాడు. ఈ వెంచర్‌కు 'కుడా' ప్రొసీడింగ్ నంబర్ సీ1/2443/2006 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో ఈ వెంచర్‌లోని 14.15 ఎకరాల భూమిలో 4.30ఎకరాల భూమిని రింగ్‌రోడ్డు కోసం సేకరించినట్లు రెవెన్యూ అధికారులు రికార్డులు సృష్టించారు. ఈ విషయంలో ప్రభుత్వ మార్గ దర్శకాలకు మంగళం పాడారు. సర్వేనంబర్ 353లో 4.30 భూమిని సేకరించి, వెంచర్ నిర్వాహకుడికి గజానికి రూ.4 వేల చొప్పున 22,990 గజాలకు లెక్క కట్టి అప్పుడున్న తహసీల్దార్, ఆర్‌డీఓలు రూ.9,19,60,000లు నష్టపరిహారంగా చెల్లించారు. ఈ డబ్బులను అప్పుడున్న అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి కలిసి పంచుకున్నట్లు కలెక్టర్, సీఎస్‌ల వరకు ఫిర్యాదులు వెళ్లాయి. అందరూ కలిసి పంచుకున్నట్లు అసలు ప్లాట్లదారులు ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసి ఏళ్లు గడుస్తున్నా విచారణ అంగుళం కూడా ముందుకు కదలడం లేదు.

కలెక్టర్ల దృష్టికెళ్లకుండా జాగ్రత్త..

రియల్ ఎస్టేట్ లేఅవుట్ ప్లాట్లు, రోడ్లు, గ్రీన్‌ల్యాండ్‌ను భూసేకరణ కింద చూపి అక్రమంగా రూ.9.19 కోట్లు చెల్లించిన రెవెన్యూ అధికారులు.. సదరు వ్యాపారిపై రెవెన్యూ రికవరీ యాక్టు పెట్టి వసూలు చేసే అవకాశం ఉన్నా స్పందించడం లేదు. 2022–23 వరకు ఆర్డీఓగా ఉన్న అధికారి దృష్టికి రైతులు తీసుకెళ్లగా.. సదరు వ్యాపారికి నోటీసులు ఇచ్చామని, త్వరలోనే వసూలు చేస్తామని చెప్పినా అమలు కాలేదు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లోనూ అప్పట్లో బాధితులు ఫిర్యాదు చేయగా.. అప్పుడున్న కలెక్టర్‌ను ఆర్డీఓ స్థాయి అధికారి ఒకరు తప్పుదోవ పట్టించారన్న ప్రచారం ఉంది. అధికారులు మారినప్పుడల్లా బాధితులు రూ.9.19 కోట్ల అక్రమాలపై ఫిర్యాదులు చేస్తున్నా ఆర్డీఓ, తహసీల్దార్ స్థాయి అధికారులు కలెక్టర్లకు తప్పుడు సమాచారం ఇస్తూ దాటవేస్తున్నారని అంటున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా, వరంగల్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం.. కచ్చితత్వం గల అధికారిణిగా పేరున్న కలెక్టర్ ప్రావీణ్య ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు రూ.9.19 కోట్లు లూటీ చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ఆర్ఆర్ యాక్టు ద్వారా డబ్బులు రికవరీ చేయాలని కోరుతున్నారు.

ప్రజావాణికి జనం బారులు

మొత్తం 193 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అధికారులకు తమ సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తంగా 193 వినతులు అధికారులకు అందాయి. ఎన్నికల నేపథ్యంలో సుమారు మూడు నెలలుగా ప్రజావాణి లేకపోవడం, కలెక్టర్‌గా నూతనంగా ప్రావీణ్య విధుల్లో చేరడంతో జనం అధిక సంఖ్యలో వచ్చారు. వినతులు పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించారు. 'తమ భూమి ధరణిలో ఇతరుల పేరుతో చూపిస్తోందని, దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ధరణిలో తమ పేరు వచ్చేలా చూడాలని' భీమారానికి చెందిన సౌందర్య వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో ఉచిత విద్యాహక్కు చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని టీఎఫ్ఎఫ్ అధ్యక్షుడు సునీల్ విన్నవించారు.

విద్యుత్ ప్రజావాణిలో 14 ఫిర్యాదులు

హన్మకొండ: విద్యుత్ ప్రజావాణిలో హనుమకొండ జిల్లాలో 14 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ టౌన్ డివిజన్– 3, హనుమకొండ రూరల్ –10, హనుమకొండ సర్కిల్‌లో 1 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషిచేయాలి

విద్యుత్ డీఈ సామ్య నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సామ్య నాయక్

దామెర : నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు సిబ్బంది కృషి చేయాలని హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ బి.సామ్య నాయక్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, లూజ్ లైన్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. విధినిర్వహణలో భాగంగా పనులుచేసే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎర్త్ రాడ్‌లను ఉపయోగించాలన్నారు. 24 గంటలు గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని వెల్లడించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో పరకాల ఏడీఈ జె.దేవేందర్, ఏఈలు గుర్రం రమేష్, జి.సత్యనారాయణ, డి.రవికుమార్, కె.విశ్వప్రసాద్, సబ్ ఇంజనీర్ చందన, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, వేణుగోపాల్, దామెర, పరకాల, నడికూడ, ఆత్మకూర్, శాయంపేట మండలాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల విడుదల

విద్యారణ్యపురి : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫస్టియర్ (జనరల్) పరీక్ష ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో బాలికలే అత్యధికంగా పాసయ్యారు. జిల్లావ్యాప్తంగా 12,694 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 8,856 మంది ఉత్తీర్ణత (69.77శాతం)సాధించారు.బాలురు 6,904 మంది పరీక్షలు రాయగా 4,473 మంది(6479శాతం), బాలికలు 5,790మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 4,383 మంది (75.7శాతం) ఉత్తీర్ణత సాధించారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు.

ఒకేషనల్ పరీక్షలో 61.11శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష (ఒకేషనల్) ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో 61.11శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 342 మంది పరీక్షకు హాజరు కాగా 209 మంది ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్‌లో 54.12శాతం ఉత్తీర్ణత

సెకండియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష (జనరల్) ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో మొత్తం 54.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 4,937మంది పరీక్షలు రాయగా 2,672 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 3,104 మందికిగాను 1,669 మంది (53.77శాతం), బాలికలు 1,833 మందికిగాను 1,003 మంది (54.72శాతం) ఉత్తీర్ణత సాధించారని డీఐఈఓ గోపాల్‌తెలిపారు.

సెకండియర్ ఒకేషనల్ ఫలితాల్లో..

సెకండియర్ ఒకేషనల్ పరీక్ష ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో 56.85శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు



'జూడా'ల సమ్మెబాట

ఎంజీఎంలో వైద్య విద్యార్థుల ఆందోళన

- ఓపీ సేవల బహిష్కరణ
- ప్రభుత్వం దిగిరాకపోతే ఎమర్జెన్సీ సేవలు నిలిపేస్తామని స్పష్టీకరణ



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూడాలు

ఎంజీఎం: సమస్యలు పరిష్కరించాలని ఆర్నెళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో జూనియర్ వైద్యులు నిరవధిక సమ్మె బాట పట్టారు. కొద్ది రోజులుగా నల్ల బ్యాడ్జీలు, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేసిన వైద్యులు ముందుగా ప్రకటించినట్లుగానే సోమవారం నుంచి ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విధులు బహిష్కరించి ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళన బాట పట్టారు. ఉదయం 9 గంటలకు ఎంజీఎంలోని గాంధీ విగ్రహ ప్రాంగణానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతీ నెల స్టైఫండ్ కోసం అధికారులకు విన్నవించినా.. నిధులు విడుదల కావట్లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మెడికల్ కళాశాలలు ప్రారంభించామని పేర్కొంటున్న ప్రభుత్వాలు ఆస్థాయిలో కళాశాలల్లో సౌకర్యాలు ఉన్నాయా.. లేవా? అనే విషయాన్ని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుందని వెంటనే భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉస్మానియాకు నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తుండడం.. వారి సంఖ్యకు తగ్గట్లుగా సౌకర్యాలు లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్ రేటు కూడా ఆస్పత్రిలో పెరిగిపోతోందన్నారు. కేఎంసీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హాస్టళ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని, కేఎంసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

స్టైఫండ్ విడుదల చేయాలి



వైద్యవిద్యార్థులకు గ్రీన్ చానల్ ద్వారా స్టైఫండ్ విడుదల చేయాలి. వైద్యవిద్యార్థుల స్టైఫండ్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి. సాధారణంగా స్టైఫండ్ విడుదల చేయాలంటే ప్రిన్సిపాల్, డీఎంఈ, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్, టోకెన్ కేటాయింపుల తర్వాత స్టైఫండ్ విడుదల చేస్తారు. ఇలా కాకుండా గ్రీన్ చానల్ పద్ధతి ద్వారా అంటే ప్రతీ నెల నిర్ణీత తేదీన వచ్చేలా నిర్ణయం తీసుకోవాలి.

- డాక్టర్ శ్రీనాథ్, జూడా రాష్ట్ర ప్రతినిధి

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?



కేఎంసీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల ఎంతో మంది విద్యార్థులు గాయాలపాలవుతున్నారు. ఈవిషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మూడు నెలల క్రితం నిధులు మంజూరైనట్లు వెల్లడించిన అధికారులు ఇంత వరకు టెండర్ పిలిచిన దాఖలాలు లేవు..

- అజయ్, కేఎంసీ జూడా చైర్మన్

హాస్టళ్లు మెరుగుపర్చాలి..



కేఎంసీలో పెరిగిన సీట్లకు అనుగుణంగా కళాశాల ప్రాంగణంలో హాస్టళ్ల సంఖ్యను కూడా పెంచాలి. నూతన మెడికల్ కళాశాల మంజూరు చేసిన ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది, హాస్టల్స్ సౌకర్యం కల్పించి మెరుగైన వైద్యవిద్యార్థులుగా తీర్చిదిద్దాలి.

- గీతాంజలి, పీజీ విద్యార్థిని

మార్కెట్ సమస్యలపై చర్చ

సమస్యలు వివరించిన చాంబర్ ప్రతినిధులు



సమావేశమైన చాంబర్ ప్రతినిధులు

వరంగల్ : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో నెలకొన్న పలు సమస్యలపై అధికారులతో కార్యవర్గ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈమేరకు సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులతో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ సెక్షన్ల కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యల్లో కొన్ని ఇలా ఉన్నాయి..

- మార్కెట్‌లోని అన్ని యార్డుల్లో క్లీనింగ్ సరిగా లేక మిర్చి, దుబ్బ, ధూళి ఎగిరి హమాలీ కార్మికులు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యార్డులను రోజువారీగా శుభ్రపరచడానికి మ్యానువల్ క్లీనింగ్‌కు బదులు మిషనరీతో చేయాలని కోరారు.
- యార్డుల్లో వైఫై లేకపోవడంతో ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు, పీఓఎస్ మిషన్లకు బ్లూటూత్ నెట్‌వర్క్ పనిచేయక రైతు సరుకుల తూకాల్లో జాప్యం జరుగుతుంది. యార్డుల్లో ఇంటర్‌నెట్ సౌకర్యంలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
- మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలు పనిచేయక రైతుల, వ్యాపారుల సరుకులు తరచూ చోరీలకు గురవుతున్నాయి. యార్డుల వారీగా సీసీ కెమెరాలు బిగించి సెంట్రలైజ్డ్ చేసి సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.
- మార్కెట్ యార్డులోని మరుగుదొడ్లు శుభ్రంగా లేవు, అలాగే తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వెంటనే శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.
- యార్డు చుట్టుపక్కల 15 కిలోమీటర్ల పరిధిలో కోల్డ్ స్టోరేజీ, మిర్చి కల్లాలు, కాటన్ జిన్నింగ్, గ్రౌండ్‌నట్ ఆయిల్ తదితర పరిశ్రమలకు రైతు సరుకుల రవాణాకు సరైన రోడ్డు మార్గం లేక హమాలీలు, వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- లారీల కొరతతో సరుకు రవాణా చేయలేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న షెడ్లను తాత్కాలికంగా వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

అనంతరం జేడీఎం మల్లేశం మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిధులు కావాలని, ఇందుకు ఎప్పటికప్పుడు మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయానికి తెలియజేస్తున్నామన్నారు. అతి త్వరలో కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, మిగతా సమస్యలపై అధికారులతో చర్చించి వారి ఆదేశాల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంఓ ప్రసాదరావు, ఉన్నతశ్రేణి కార్యదర్శి జి.రెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి రాము, చాంబర్ ప్రతినిధులు వేద ప్రకాశ్, ఎన్.రెడ్డి లింగారెడ్డి, చింతపల్లి వీరారావు, పెంటయ్య పాల్గొన్నారు.

28న వరంగల్‌కు సీఎం రేవంత్

గ్రేటర్ వరంగల్‌లో పలు అభివృద్ధి పనులపై సమీక్షించే అవకాశం



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 28న వరంగల్ నగరానికి రానున్నారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు సోమవారం సాయంత్రం సమాచారం అందినట్లు తెలిసింది. 28న ఉదయమే హనుమకొండకు చేరుకోనున్న ముఖ్యమంత్రి కలెక్టరేట్‌లో పలు అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మొదటగా సుమారు రూ.4వేల కోట్ల వ్యయమయ్యే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టంపై ఆయన చర్చించే అవకాశం ఉంది. అదేవిధంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితోపాటు కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల తీరుపై, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణం, అందుకు కావాల్సిన భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ – 2041 పైన 'కుడా', గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించనున్నారు. గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీకి చాలా ఏళ్లక్రితం ఎంపికైనప్పటికీ నిధులు లేక పనులు మందకొడిగా సాగుతున్నాయి. సీఎం ప్రత్యేకించి స్మార్ట్ సిటీ కోసం వెచ్చించిన నిధులు.. ఇప్పటివరకు జరిగిన పనులపై రివ్యూ చేసే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆ తర్వాత హంటర్ రోడ్డులో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభంతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సమయానుకూలతను బట్టి నయీంనగర్ వంతెన పనులు పరిశీలించే అవకాశం ఉంది.

సీఎం రాక కోసం విస్తృతంగా ఏర్పాట్లు

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సీఎం రాక సందర్భంగా ఏర్పాట్లపై ఈనెల 26న మంత్రులు సమీక్షిస్తారని పేర్కొన్నారు.

ముంపు నివారణకు పటిష్ట ప్రణాళిక

● జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కాశీబుగ్గ సెంటర్: ముంపు నివారణకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వర్షాకాలం నేపథ్యంలో ముంపు నివారణకు చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. జిల్లాలోని ముంపు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో నివారణ కోసం చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, మండలాల వారీగా రహదారులు, మైనర్ ఇరిగేషన్ పెండింగ్ పనులు, ముంపు ప్రాంతాల వివరాల నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపల్, నీటి పారుదల, విపత్తు నివారణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. వరదల సమయంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఇప్పటి నుంచే తగు ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు సాగాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివేకానందకాలనీలో భారీ చోరీ

● రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారం అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ కాశిబుగ్గ వివేకానంద కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు, ఇంతేజార్‌గంజ్ సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానందకాలనీలోని వెల్లంకి వేణుగోపాల్ ఇంట్లో గుండు సదానందం మూడేళ్లనుంచి అద్దెకుంటున్నాడు. రాధిక థియేటర్ సమీపంలో లలిత ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 20న భార్యతో కలిసి అరుణాచలం దర్శనానికి వెళ్తూ ఇంటికి, గేటుకి తాళం వేశారు. 23న ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి తాళం తీసి నెడుతుంటే గేటు లోపలికి పోవడం లేదు. లోపల గడియ పెట్టి ఉంది. గడియ తీసి లోపలికి వెళ్లే సరికి ప్రధాన ద్వారం తాళాలు పగలకొట్టి ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు వేసి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి పై ఫ్లోర్‌కు వెళ్లేసరికి అక్కడ కూడా లైట్లు వేసి బీరువా తెరిచి బట్టలు చిందవందర పడిగా ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారం అపహరణకు గురైనట్లు గ్రహించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతేజార్‌గంజ్ పోలీసులు, క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. సోమవారం విషయం తెలుసుకున్న వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఘటన స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. బాధితుడు సదానందం మాట్లాడుతూ బాలాజీనగర్‌లో కొత్త ఇల్లు నిర్మాణం చేస్తున్నానని, దాని కోసం బయటనుంచి అప్పుగా తెచ్చిన నగదును, పిల్లల కోసం దాస్తున్న బంగారాన్ని దొంగలు అపహరించుకపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు.

టీజీ ఎన్పీడీసీఎల్.. అధునాతన సాంకేతికత వినియోగంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురానుంది. దీని వల్ల సబ్‌స్టేషన్‌లో లోడ్, పవర్ ఫ్యాక్టర్, ట్రిప్పింగ్‌లు, బ్రేక్ డౌన్‌లు, లైన్ క్లియర్ (ఎల్‌సీ)లకు సంబంధించిన పూర్తి సమాచారం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంతోపాటు, సర్కిల్, సబ్‌స్టేషన్లలో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు ఇచ్చే సమాచారంతో తెలుసుకుంటున్నారు. ఇక నుంచి ఎక్కడ అంతరాయం ఏర్పడింది.. సబ్ స్టేషన్‌లో లోడ్ ఏ మేరకు ఉంది.. ట్రిప్పింగ్‌లు, ఎక్కడ బ్రేక్ డౌన్ అయింది.. వంటి సమస్యలు ఆయా కార్యాలయాల్లో అధికారుల ముంగిట కనిపిస్తుంది. దీంతో వెంటనే ఉద్యోగులను అప్రమత్తం చేసి నివారణ చర్యలు చేపట్టొచ్చు.



ఒడిశాలో రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీతో పని చేస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్

ఇక.. గుర్తింపు సులువు

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో నూతన టెక్నాలజీ వినియోగం

- ముందుగా విద్యుత్ అంతరాయం తెలుసుకోవడంపై దృష్టి
- పైలట్ ప్రాజెక్టు కింద రెండు సబ్ స్టేషన్లలో అమలు
- ఆ తర్వాత మానవ ప్రమేయం లేకుండా సబ్ స్టేషన్ల నిర్వహణ
- ఒడిశా వెళ్లి అధ్యయనం చేసివచ్చిన అధికారుల బృందం

హన్మకొండ: శాస్త్ర, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ రంగంలోనూ చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అధునాతన సాంకేతికను వినియోగించుకునేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు ఉత్సాహం చూపుతున్నాయి. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకుంటూ ముందుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే మానవ ప్రమేయం లేకుండానే విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణపై తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి (టీజీ ఎన్పీడీసీఎల్) దృష్టి సారించింది. ప్రస్తుతం ఆపరేటర్లు సబ్ స్టేషన్ల నిర్వహణ చూసుకుంటున్నారు. నూతన టెక్నాలజీతో ఆపరేటర్ల అవసరం లేకుండానే 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ జరుగనుంది. ఇందులో భాగంగా ముందుగా టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని 33/11 కేవీ సబ్–స్టేషన్లు, 33/11కేవీ ఫీడర్లను రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీలోకి తీసుకురావడానికి సన్నాహాలు మొదలు పెట్టింది. ఈ కొత్త టెక్నాలజీతో సబ్‌స్టేషన్‌లో లోడ్, పవర్ ఫ్యాక్టర్, ట్రిప్పింగ్‌లు, బ్రేక్ డౌన్‌లు, లైన్ క్లియర్ (ఎల్‌సీ)లకు సంబంధించిన పూర్తి సమాచారం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంతోపాటు, సర్కిల్, సబ్‌స్టేషన్లలో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు ఇచ్చే సమాచారంతో తెలుసుకుంటున్నారు. ఇక నుంచి కార్యాలయాల్లోనే ఎక్కడ అంతరాయం ఏర్పడింది.. సబ్ స్టేషన్‌లో లోడ్ ఏ మేరకు ఉంది... జరిగిన ట్రిప్పింగ్‌లు, ఎక్కడ బ్రేక్ డౌన్ అయింది.. వంటి సమస్యలు కార్యాలయాల్లో అధికారుల ముంగిట కనిపిస్తుంది. దీంతో వెంటనే ఉద్యోగులను అప్రమత్తం చేసి నివారణ చర్యలు చేపట్టొచ్చు. దీంతో పాటు అంతరాయం కలిగిన స్వల్పకాలంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే అవకాశముంది.



టెక్నాలజీ పనితీరు తెలుసుకుంటున్న ఎన్పీడీసీఎల్ టెక్నికల్ టీమ్

టెక్నాలజీ అమలుకు పైలట్ ప్రాజెక్ట్

ఈ కొత్త రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని పైలట్ ప్రాజెక్ట్ క్రింద 'స్కాప్', 'స్కినీడర్' అనే కంపెనీల ద్వారా అమలు చేయనున్నారు. జనగామ సర్కిల్ పరిధిలోని చిల్పూరు మండలం చిన్న పెండ్యాల, రఘునాథపల్లి మండలం నిడిగొండ సబ్ స్టేషన్‌లలో ఈ కంపెనీలు అవసరమైన రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ పనులు జూలై 5 వరకు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఆదేశించింది. తర్వాత వీటి పని తీరును అధ్యయనం చేసి సత్ఫలితాలను బట్టి ఎన్పీడీసీఎల్‌లోని మిగతా సబ్ స్టేషన్‌లో ఈ టెక్నాలజీ అమలుకు టెండర్లు పిలవాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. తద్వారా మానవరహిత సబ్‌స్టేషన్‌లుగా మార్చే ఆలోచనలో టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సమాయత్తమవుతోంది.

కొత్త విధానం అధ్యయానికి టెక్నికల్ టీమ్..

ఈ కొత్త విధానాన్ని అధ్యయనం చేయడానికి టెక్నికల్ టీమ్‌ను నియమించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ వి.మోహన్ రావు, జీఎం (ఐటీ) జి.శ్రీనివాస్, ఆపరేషన్ జీఎం కె.గౌతంరెడ్డి, డీఈ (ఐటీ) కె.అనిల్ కుమార్, స్కాడా ఏడీ శ్రీకాంత్‌తో కూడిన ఈ టెక్నికల్ అధికారుల (ఇంజనీర్లు) బృందం ఈ నెల 11, 12 తేదీల్లో ఒడిశాలో టాటా పవర్ వెస్ట్రన్ ఒడిశా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో అమలు చేస్తున్న తీరు, విధి విధానాలను అధ్యయనం చేసి వచ్చారు.

అధ్యయనంలో పరిశీలించిన విషయాలు..

త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించడం ద్వారా అంతరాయాల సమయం తగ్గించొచ్చు. తద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించగలగొచ్చు. అంతరాయ సమయం కనిష్టంగా ఉంటుంది. మెరుగైన సరఫరా–పర్యవేక్షణ ఉంటుంది. మెరుగైన సరఫరా, పర్యవేక్షణ ఫలితంగా పరికరాల జీవితకాలం పెరుగుతుంది. వీటితో పాటు సబ్ స్టేషన్ ఆటోమేషన్ టెక్నాలజీపై గ్రామీణ డిజిటల్ సబ్ స్టేషన్ స్థాయిని పెంచడంపై సాధ్యాసాధ్యాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయలు కనిష్ట స్థాయికి తగ్గించి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంపై టెక్నికల్ టీం సంపూర్ణంగా అధ్యయనం చేసింది. కొత్త టెక్నాలజీ అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని యాజమాన్యం తెలిపింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: బ్రేక్ డౌన్‌లు, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీ చోట ప్రత్యామ్నాయ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి నోడల్ ఆఫీసర్లు, సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేని చోట కొత్త లైన్లు నిర్మించి అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కనిష్ట స్థాయికి బ్రేక్ డౌన్‌లు, ట్రిప్పింగ్‌లు తగ్గించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. పొడవాటి లైన్‌లు, ట్యాపింగ్ లైన్‌లు ఉన్న చోట ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ) బిగించాలన్నారు. తద్వారా అంతరాయాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు వైఫల్యం చెందిన వెంటనే మార్చాలన్నారు. అలాగే, రోలింగ్ స్టాక్ పెంచుకోవాలన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సీజీఎంలు కె.తిరుమల రావు, టి.మధుసూదన్, రాజు చౌహాన్, కె.కిషన్, కెఎన్ గుట్ట, జీఎంలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ

కార్మిక ఖజానా ఖాళీ?

- భవన నిర్మాణ కార్మికులకు అందని ఆర్థిక సాయం
- పెండింగ్‌లో 8వేల పైచిలుకు దరఖాస్తులు
- ఏడాదిన్నరగా ఎదురుచూపులు

హన్మకొండ చౌరస్తా: తెల్లారితే అడ్డా మీద పనికోసం వెదుకులాట.. కూలీ దొరికితేనే కుటుంబం గడిచేది.. లేదంటే పస్తులే. ఇలా దినదిన గండంగా బతుకు లీడుస్తున్న అడ్డా కూలీలకు సర్కారు నుంచి భరోసా కరువైంది. కార్మిక సంక్షేమ శాఖ నుంచి అందాల్సిన సాయం వారి దరి చేరడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వ సాయం అందక అవస్థలు పడుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక కార్మికశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ శాఖ ద్వారా నిర్మాణ రంగ కార్మికులకు పలు ప్రయోజనాలను అందజేస్తోంది. అందుకోసం భవనం, ఇతర నిర్మాణ రంగ కార్మికులు ఏటా రూ.110 చెల్లించి కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకోవాలి. అనంతరం కార్మికులకు కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డు అందజేస్తారు. అప్పటి నుంచి కార్మిక సంక్షేమ శాఖ ద్వారా ప్రయోజనాలు వర్తిస్తాయి.

పెండింగ్‌లో 8 వేల దరఖాస్తులు..

వివిధ కేటగిరీల్లో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా కార్మిక కుటుంబాలకు నిరాశే మిగిలింది. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8వేల పైచిలుకు నిర్మాణ రంగ కార్మిక కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాయి.



కార్మికులకు అందించే సంక్షేమ ఫలాలు..

- కార్మిక సంక్షేమ శాఖ ద్వారా గుర్తింపు కార్డు కలిగిన నిర్మాణ రంగ కార్మికులకు వివిధ కేటగిరీల్లో లబ్ధి చేకూర్చుతుంది.
- భవన నిర్మాణ కార్మికుడి కూతురు వివాహానికి రూ. 30వేలు సాయం.
- కార్మికుడి భార్య లేదా కార్మికురాలు ప్రసూతి సాయానికి రూ.30 వేలు.
- నిర్మాణ కార్మికుడు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.30 వేలు.
- నిర్మాణ కార్మికుడు సహజ మరణం పొందితే రూ.లక్ష.
- ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రోజుకు రూ.300 చొప్పున రూ.4,500 వరకు చెల్లింపు.
- నిర్మాణ రంగ నైపుణ్యత శిక్షణకు రోజుకు రూ.300 ఇస్తారు.
- పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందితే రూ.4 నుంచి రూ.5లక్షలు
- ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 6లక్షల సాయం ఇస్తారు.

ప్రతిపాదనలు పంపించాం..



వివిధ కేటగిరీల్లో ఆర్థికసాయం కోసం కార్మికుల నుంచి అందుకున్న దరఖాస్తులను ప్రతి నెలా కార్మిక సంక్షేమ బోర్డుకు అందజేస్తున్నాం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలు, కావాల్సిన మొత్తానికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కార్మికులకు అందజేస్తాం.

– రమేశ్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, వరంగల్


ఏడాదిన్నరగా ఎదురుచూపులు



ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికులు సుమారు 60వేల పైచిలుకు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గడిచిన ఏడాది నుంచి జిల్లా వ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దినసరి కూలీలకు రావాల్సిన సంక్షేమ నిధిని తక్షణమే విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాలకు అండగా ఉండాలి.

– తాటి సత్యనారాయణ, శ్రమశక్తి అవార్డు గ్రహీత

లైంగిక వేధింపు కేసులో నేరస్తుడికి రెండేళ్ల జైలు



వరంగల్ లీగల్ : ప్రేమిస్తున్న.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంటి నుంచి బాలికను తీసుకెళ్లిన ఘటనలో నేరం రుజువుకావడంతో ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామానికి చెందిన నేరస్తుడు సింగారపు దిలీప్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక నగరంలోని ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. వారి సమీప బంధువైన సింగారపు దిలీప్ సదరు బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని పలుమార్లు వేధింపులకు గురి చేశాడు. తాను నిరాకరించడంతో నువ్వు ఒప్పుకోకపోతే చనిపోతానని బెదిరించాడు. ఈ క్రమంలో 2018, ఏప్రిల్ 29న (ఆదివారం) దిలీప్ ఫోన్ చేసి 'మనం పెళ్లి చేసుకుందాం నువ్వు రా' అని చెప్పాడు. లేదంటే చనిపోతానని బెదిరించడంతో సదరు బాలిక చర్చికి వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరుసటి రోజు బాలిక తండ్రి ధర్మసాగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాలిక.. దిలీప్ చెప్పిన విధంగా సిద్దిపేట మీదుగా హైదరాబాద్ చేరుకుని అక్కడి నుంచి పెళ్లి చేసుకునే నిమిత్తం తిరుపతి వెళ్లారు. తాను మేజర్ కానందున పురోహితులు వివాహం చేయడానికి నిరాకరించారు. మేజర్ కావడానికి ఆరు రోజుల వ్యవధి ఉండడంతో ఇరువురు అక్కడే మే 6వ తేదీ వరకు ఉన్నారు. ఈ క్రమంలో ధర్మసాగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిన దిలీప్.. బాలికను తన ఇంటికి పంపించాడు. దీనిపై విచారణ చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో దిలీప్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో భరోసా సెంటర్ న్యాయసలహాదారు నీరజ, కానిస్టేబుల్ అశోక్ సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గీసుకొండ: వైద్యులు, సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వరంగల్ డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ కోరారు. సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు ప్రసవించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే ఆర్థికభారంతో పాటు ఆరోగ్యానికి గ్యారంటీ ఉండదన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ అధికారులు ప్రకాశ్‌రెడ్డి, సోమేశ్వర్ పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్: సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సి.భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా వంద మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఏదైనా డిగ్రీ /ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, దివ్యాంగులు జూలై 10లోగా htttp://tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు జూలై 21న హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ కేంద్రాల్లో ఎంపిక పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040–23546552, 81216 26423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. సోమవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్ ఈఈయూ–327 కార్యాలయం పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాలకు చెందిన ఆర్టిజన్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ సంస్థల యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించారన్నారు. త్వరలో సమస్యలు, పరిష్కారమార్గాలతో కూడిన నివేదిక అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పప్పు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయా యూనియన్‌లకు చెందిన 50 మంది ఆర్టిజన్ ఉద్యోగులు టీఎస్ ఈఈయూ–327లో చేరారు. టీఎస్ఈఈయూ–327 ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నీలం ఐలేశ్, సత్యనారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, ఎం.బుచ్చయ్య గౌడ్, ఓదెలు, సీహెచ్.సతీశ్, కె.రాంబాబు, సికిందర్ పాల్గొన్నారు.

విచారణ సరే.. చర్యలేవి?

- దత్తత దందాలో అధికారుల ఉదాసీనత
- నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు సున్నా..
- కలెక్టర్లు స్పందిస్తేనే ఈ వ్యవహారానికి చెక్!

సాక్షి, వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లా సంక్షేమ విభాగాల తీరు వివాదాస్పదంగా మారుతోంది. దత్తత తీసుకునే దంపతుల నుంచి అడపాదడపా డబ్బులు రాబట్టిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై తూతూ మంత్రంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వరంగల్ జిల్లాలోని దత్తత కేసుల విషయంలో హనుమకొండ బాలల పరిరక్షణ విభాగానికి చెందిన లీగల్ ప్రొబేషన్ అధికారి ఒకరు తల దూర్చారని, దంపతుల నుంచి డబ్బులు వసూలు చేశారని వెలుగులోకి రావడంతో 'దత్తతలో దందా' వెనుక మతలబు ఏంటో అన్న చర్చ జోరుగా సాగుతోంది. అయితే తనకు పైఅధికారుల అండ ఉందని, ఎవరూ ఎన్ని ఫిర్యాదులిచ్చినా.. కథనాలు రాసినా తనకేం అవ్వదనే ధోరణిని ఆ అధికారి సిబ్బంది ఎదుట ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ అధికారిపై చర్యలు తీసుకుంటారా? లేదా అనే అనుమానం సిబ్బందిలో రేకెత్తుతోంది.

ఇబ్బందులు తప్పవా?

వరంగల్ కలెక్టర్‌గా పనిచేసి హనుమకొండకు కలెక్టర్‌గా వెళ్లినా ప్రావీణ్యకు దత్తత దందాపై పూర్తి అవగాహన ఉండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో అనే భయం తప్పు చేసిన వారికి లోలోన ఉన్నప్పటికీ, పైకి మాత్రం అంతా 'మధు'రంగానే ఉన్నట్టుగా కవరింగ్ ఇస్తున్నారని సహ సిబ్బంది చర్చించుకుంటున్నారు. దత్తత దందాపై ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ విభాగం డైరెక్టర్ వాకాటి కరుణ కూడా దృష్టి సారించడంతో వీరిని వెనుకేసుకొస్తున్న అధికారులకు కూడా ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. ఇలాంటి కేసుల విషయంలో సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని సామాజిక కార్యకర్తలు అంటున్నారు.



విచారణ చేస్తున్న బృంద సభ్యులు (ఫైల్)

కానరాని చర్యలు

పిల్లలు లేని దంపతులు పిల్లలు కావాలంటూ చట్టబద్ధత ప్రకారం దరఖాస్తు చేసుకున్నా.. జిల్లా బాలల సంరక్షణ దత్తత విభాగాధికారుల తీరుతో ఇబ్బందులు తప్పడం లేదని 'సాక్షి'లో మే 31, జూన్ 8న 'నిబంధనలు బేఖాతర్', 'దత్తతలో దందా' కథనాలు ప్రచురితమయ్యాయి. అనంతరం అప్పటి వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య విచారణకు ఆదేశించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆమె ఆదేశాలతో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఈ నెల 10న విచారించారు. ఈమేరకు రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు, సవిత, వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతుల ఇళ్లకు వెళ్లిన ఈ బృందం వారి దత్తతకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు.

సీనియార్టీ కోల్పోయామని ఆవేదన..

వరంగల్ జిల్లా బాలల సంరక్షణ విభాగ దత్తత అధికారుల కారణంగానే దత్తతలో ముందు వరుసలో ఉన్న తాము రీవాలిడేషన్‌కు రిక్వెస్ట్ పెట్టుకున్నా.. హోమ్ స్టడీ చేయకపోవడంతో సీనియార్టీ కోల్పోయామని దత్తత తీసుకునే దంపతులు వాపోతున్నారు. అసలు తమకు పిల్లలే వద్దన్నట్టుగా ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా)కి ఎలా మెయిల్ పంపుతారని.. కనీసం తమ ఇంటికి రాకుండానే విచారణ నివేదిక ఎలా సమర్పిస్తారని మురుపోజు రాంబాబు దంపతులు విచారణ బృందం ఎదుట వాపోయారు. అలాగే వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతులు కూడా రీవాలిడేషన్ కోసం హనుమకొండ బాలల పరిరక్షణ విభాగానికి చెందిన ఓ అధికారికి రూ.ఆరు వేలు (డీడీ కోసం రూ.రెండు వేలు, ఇతర ఖర్చుల కోసం రూ.నాలుగు వేలు) ఇచ్చామని, నెలలో రెండుసార్లు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఓపెన్ చేసి స్టేటస్ తెలుసుకునేందుకు వచ్చిన ప్రతిసారి రూ.500 గత మూడున్నరేళ్లుగా ఇస్తూ వస్తున్నామని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేసినట్టుగా విచారణ బృందానికి వెల్లడించారు.

కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లారా?

ఈ విచారణ నివేదిక సిద్ధం చేసి రెండు వారాలు దాటినా ఇప్పటికి పురోగతి లేకపోవడంతో జరిగిన వాస్తవాల్ని కొత్త కలెక్టర్ సత్య శారదాదేవి దృష్టికి తీసుకెళ్లారా.. లేదా? అనే చర్చ జరుగుతోంది. హనుమకొండ బాలల పరిరక్షణ విభాగంలోని లీగల్ ప్రొబేషన్ అధికారిపై దత్తత దంపతులు బొమ్మిడి నర్సయ్య లిఖిత పూర్వకంగా డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు చేసినా కనీసం విచారణ చేయకుండా ఆ జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో అతడిని వెనకేసుకొస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. దత్తత దంపతులకు న్యాయం చేయాలని.. విధుల్ని నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, దీనిపై కలెక్టర్లు సత్య శారదాదేవి, ప్రావీణ్య దృష్టి సారించాలని బాధితులు, ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగులకు శుభవార్త..

కాజీపేట రూరల్: ఏపీఏఆర్ హెచ్‌ఆర్‌ఎంఎస్‌లో గుడ్ లేదా తక్కువ గ్రేడ్ పొందిన రైల్వే ఉద్యోగులకు సంబంధించి తిరిగి రివ్యూ అవకాశం ఇస్తూ రైల్వే బోర్డు ఉత్వర్వులు జారీ చేసిందని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 నాటికి లోయర్ గ్రేడ్ మూలంగా ఎంఏసీపీఎస్ పొందే అవకాశం కోల్పోయిన ఉద్యోగులకు ఇప్పుడు జూలై 15, 2024 లోపు హెచ్‌ఆర్ ఎంఎస్‌లో ఏపీఏఆర్ సమీక్ష (రివ్యూ) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాడిఫైడ్ అష్యూర్ కెరీర్ ప్రొగ్రెషన్ స్కిల్ (ఎంఏసీపీఎస్.. పదోన్నతులు రాని రైల్వే ఉద్యోగులకు ప్రతి 10 ఏళ్లకు ఒకసారి పదోన్నతి కల్పించే స్కీం) స్కీం కింద రైల్వే కార్మికులకు లేదా ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తారు. దీనికి గాను రైల్వే కార్మికులు, ఉద్యోగులు సర్వీస్ రికార్డులో మూడు ఏళ్ల వరుసగా వెరి గుడ్ ఫర్ఫామెన్స్ కలిగి ఉండాలి. గుడ్ ఫర్ఫామెన్స్ లేని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారి ఒప్పుకుంటే వెరి గుడ్‌గా మర్చే అవకాశం ఉంది. ఈ స్కీంతో పదోన్నతి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.